క్లుప్తంగా

మైనార్టీలకు తోడ్పాటును అందించాలని వినతి


ఉమర్‌జలీల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట: నియోజకవర్గంలో అర్హులైన మైనార్టీలకు ప్రభుత్వ పథకాల్లో లబ్ధిచేకూరేలా చేయూతనివ్వాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ డైరెక్టర్ సయ్యద్ ఉమర్ జలీల్‌ను కోరారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. మైనార్టీల కోసం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల్లో పెద్దపీట వేయాలని ఎమ్మెల్యే కోరారు. ప్రధానంగా మైనార్టీ బంధు లబ్ధిదారుల సంఖ్య నియోజకవర్గంలో పెంచే అంశాన్ని పరిశీలించాలన్నారు.

కృష్ణాష్టమి నృత్య ప్రదర్శనకు దరఖాస్తులకు ఆహ్వానం

చిక్కడపల్లి: శ్రీ కృష్ణ జన్మష్టమి సందర్భంగా బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో శ్రీకృష్ణవేషధారణ, సంగీతం, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు శిఖరం ఆర్ట్ థియేటర్స్ స్థాపక కార్యదర్శి జి.కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్లున్న బాలబాలికలు ఈ ప్రదర్శనలో పాల్గొనవచ్చని ఆసక్తి కలిగినవారు ఈనెల 2 లోగా తమ పేర్లను దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9494523562.

ఓటరు నమోదుపై ఇంటింటి ప్రచారం

నల్లకుంట: ఓటరు నమోదు ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లకుంట డివిజన్‌లో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. దీనిలో భాగంగా బూత్ నంబరు 10, 11లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ.. 18 ఏళ్లు నిండినా ఓటరుగా నమోదు కానివారి వివరాలు, చిరునామాలో మార్పు, ఇతర సమస్యల పరిష్కారానికి అవగాహన కల్పించారు. బీజేపీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి వనం రమేష్, 10వ బూత్ ప్రెసిడెంట్ కె. నిఖిల్, 11వ బూత్ ప్రెసిడెంట్ ఎస్. సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌-యూటీఏ ఆవిర్భావం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వర్సిటీల అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ స్టేట్ యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్ (టీఎస్‌-యూటీఏ) ఆవిర్భావించింది. శుక్రవారం తెలుగు యూనివర్సిటీలో జరిగిన సమావేశంలో అనేక అంశాలను చర్చించి టీఎస్ యూటీఏను ప్రకటించారు. అధ్యక్షులుగా ఓయూ అధ్యాపకులు ప్రొ.మల్లేశం, కార్యదర్శిగా సీహెచ్.శ్రీనివాస్, ముఖ్యసలహాదారులు మల్లికార్జున్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వ్యక్తి అదృశ్యం


రాకేష్‌గౌడ్ (ఫైల్)

నల్లకుంట: ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. అడ్మిన్ ఎస్సై శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. రియల్ ఎస్టేట్ వ్యాపారి పబ్బ రాకేష్ గౌడ్(43) విద్యానగర్ ఎస్ఆర్‌టీ కాలనీలో నివాసముంటున్నాడు. గత నెల 13న సాయంత్రం 7.30 గంటల సమయంలో అంబర్‌పేట అనంతరామ్‌నగర్‌లో ఉండే బాబాయి పబ్బ మల్లిఖార్జున్‌గౌడ్‌తో ఫోన్‌లో మాట్లాడి 14న కలుద్దామని చెప్పినట్టు సమాచారం. ఆ తర్వాత రాకేష్ ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో మల్లిఖార్జున్‌కు అనుమానం వచ్చి ఎస్ఆర్టీలోని రాకేష్ ఇంటికి వెళ్లి చూడగా.. తాళం వేసి ఉంది. బంధువులు, కుటుంబసభ్యులను విచారించినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన అతడు సోదరుడి కుమారుడు కనిపించడం లేదని శుక్రవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి పైప్‌లైన్లు ఆధునీకరిస్తున్నాం

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్‌లోని కాలనీలు, బస్తీల్లోని అన్ని తాగునీటి పైప్‌లైన్లను ఆధునీకరిస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని వాణీనగర్‌లో నిర్మాణం పూర్తైన తాగునీటి పైప్‌లైన్లను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐఎస్‌సదన్‌లోని పలు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పైప్‌లైన్ల వల్ల ఆయా ప్రాంతాల వారు కలుషిత నీరు, లో ప్రెషర్ నీటి సరఫరా వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్టు తన పర్యటనల్లో గుర్తించానన్నారు. డివిజన్‌లోని తాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ఐఎస్‌సదన్‌లోని అన్ని ప్రాంతాల్లో నూతన పైప్‌లైన్లు ఏర్పాటు చేయిస్తామన్నారు. పైప్‌లైన్ పనులు పూర్తైన ప్రాంతాల్లో వెంటనే రహదారులు వేస్తామన్నారు.కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డీఈ కదీర్, ఏఈ మినాజ్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

- ముషీరాబాద్‌లో 500 మందికి డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరు
- నేడు లబ్ధిదారులను లక్కీడ్రా ద్వారా ఎంపిక
- మేడ్చల్ జిల్లా ఆమద్‌గూడలో ఇళ్ల కేటాయింపు
- నేరుగా ఫోన్ చేసి చెప్పిన ఎమ్మెల్యే ముఠా గోపాల్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పేదల పట్ల ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుందని చెప్పేందుకు డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరే చక్కటి నిదర్శనమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లకు పేదల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. నియోజకవర్గంలో మొదటి దఫాగా 500 మందికి డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేశామన్నారు.

- మేడ్చల్ జిల్లా ఆమద్‌గూడలో ఈ నెల 2న లక్కీడ్రా ద్వారా లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల వద్దకు వెళ్లేందుకు ప్రభుత్వం తరపున 25 బస్సులను ఏర్పాటు చేశామన్నారు.
- నేడు ఉదయం 8.30 గంటలకు ఇందిరాపార్కు వద్ద ఉన్న ఎన్టీఆర్ స్టేడియానికి లబ్ధిదారులంతా ఆధార్ కార్డులు తీసుకుని రావాలని ఎమ్మెల్యే సూచించారు.
- లబ్ధిదారులందరికీ లాటరీ తీసి ఇళ్లను కేటాయిస్తామన్నారు. ప్రతి బస్తీకి ఒక రెవెన్యూ ఇన్‌చార్జి ఉంటారని అందువల్ల ఏ లబ్ధిదారులకు కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదన్నారు.
- అవినీతికి తావులేకుండా పేద ప్రజలకు చక్కటి గృహాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. పేదలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని ఎమ్మెల్యే వివరించారు.
- ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్వయంగా ఎంపికైన లబ్ధిదారులందరికీ స్వయంగా ఫోన్ చేసి సమాచారమిచ్చారు. బీఆర్ఎస్ యువ నేత ముఠా జైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, రాంనగర్ డివిజన్ అధ్యక్షులు రావులపాటి మోజెస్, ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డి, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేష్‌కుమార్, ముషీరాబాద్ అధ్యక్షులు నర్సింగ్‌ప్రసాద్, అడిక్‌మెట్ అధ్యక్షులు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, కవాడిగూడ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్ తదితరులున్నారు.


లబ్ధిదారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అర్హుల లిస్టు ప్రకటించాలి


బాగ్‌లింగంపల్లి వార్డు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: డబుల్ బెడ్రూం ఇళ్ల అర్హుల లిస్టును ప్రకటించాలని సీపీఎం పార్టీ ముషీరాబాద్‌జోన్ కార్యదర్శి ఎం.దశరథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని వార్డు కార్యాలయం వద్ద అర్హుల లిస్టు ప్రకటించాలని కోరుతూ.. ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులలిస్టు ప్రకటించకుండా ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నారన్నారు. కలెక్టర్ కార్యాలయంలో డ్రా తీసిన లిస్టును వార్డు కార్యాలయాల్లో పెట్టకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. పార్టీ నాయకులు కె.రమేష్, వి.విజయ్‌కుమార్, సుగుణ, జ్యోతి, మల్లమ్మ తదితరులున్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు చేయూత


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సత్యనగర్ కాలనీవాసులు

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లోని సత్యనగర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సత్యానగర్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తన వంతు సహకారంగా రూ. 50 వేల ఆర్థిక సహకారాన్ని కాలనీ వాసులకు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనగర్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఆర్.రాజన్‌బాబు ఎమ్మెల్యేను శుక్రవారం సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ వాసుల సమస్యల పరిష్కారానికి తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

‘కేంద్ర విధానాల వల్లే నిత్యావసరాల పెంపు’



నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

ముషీరాబాద్: దేశంలో కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్నంటి పేద ప్రజలపై భారాన్ని మోపాయని సీపీఎం ముషీరాబాద్‌జోన్ కార్యదర్శి దశరథ్ ఆరోపించారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ.. సీపీఎం ముషీరాబాద్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో ముషీరాబాద్ చౌరస్తా, బడీ మసీదు వద్ద నిరసన చేపట్టారు. నిత్యావసరాలు, పెట్రోల్, డిజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని నినాదాలు చేశారు. ఎం.దశరథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖలను ప్రైవేటు పరం చేస్తూ.. నిరుద్యోగుల పొట్టకొడుతున్నారని ఆరోపించారు. గతంలో ఇచ్చిన వాగ్దానాలను ప్రభుత్వం నిర్వహించడం లేదన్నారు. ధరలు తగ్గించని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం హైదరాబాద్ జిల్లా కమిటీ సభ్యులు పద్మ, ముషీరాబాద్ జోన్ నాయకులు శ్రీరాములు, బాబు, పాషా, కృష్ణస్వామి, మోహన్, శేఖర్, ఆంజనేయులు, నరేష్ తదితరులున్నారు.

కాంగ్రెస్ బీసి డిక్లరేషన్ కమిటీ మెంబర్‌గా శ్రీనివాసులు గౌడ్


డా.ఎస్.ఎల్. శ్రీనివాసులు గౌడ్‌ను సన్మానిస్తున్న నేతలు

లాలాపేట: తెలంగాణ కాంగ్రెస్ పార్టీ బీసి డిక్లరేషన్ కమిటీ మెంబర్‌గా తార్నాక డివిజన్ లాలాపేటకు చెందిన టీపీసిసి సెక్రటరీ డా.ఎస్.ఎల్. శ్రీనివాసులుగౌడ్ నియమితులైనారు. ఈ మేరకు ఇటీవల టీపీసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్ కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సికింద్రాబాద్ నియోజక వర్గం నుంచి బీసి డిక్లరేషన్ కమిటీలో ఈయనకు స్థానం లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం తార్నాకలో సికింద్రాబాద్ ఎమ్మెల్యే ఆస్పిరెంట్, ప్రముఖ న్యాయవాది, సోషల్ జస్టిస్ సంఘం అధ్యక్షులు నాగుల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీనివాస్‌లు గౌడ్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు.

ముగిసిన శాస్త్రీయ సంగీత నృత్య పోటీలు

సుల్తాన్‌బజార్: గత వారం రోజులుగా తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగిన 48వ జాతీయ స్థాయి శాస్త్రీయ సంగీత నృత్య పోటీలు శుక్రవారం రాత్రి ముగిశాయి. ప్రముఖ సంగీత విద్వాంసులు డాక్టర్ ఆడేపల్లి లోకనాథశర్మ ముఖ్యఅతిథిగా హాజరై ప్రముఖ భరతనాట్య గురువులు శీలా ఉన్ని కృష్ణన్, రతీష్‌బాబు, సంజయ్, శాంతిరామ్, కళారత్న మాధవిమాలలను సత్కరించారు. భారతీయ శాస్త్రీయ సంగీత నృత్యాలకు గురు శిష్యుల పరంపర ముఖ్యమైందన్నారు. చలపతిశాస్త్రి, లక్ష్మీమానస, మధుమతి, హేమరాజు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వివిధ రాష్ట్రాల నృత్య గురువులను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఇఫ్లూలో పూర్వ విద్యార్థుల నెట్ వర్క్

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)లో పూర్వవిద్యార్థుల నెట్ వర్క్‌ను వీసీ ప్రొ.సురేష్‌కుమార్ ప్రారంభించారు. శుక్రవారం వర్సిటీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో సీఐఈఈ నుంచి ఇఫ్లూ (1958-2023) జ్ఞాపాలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. పలువురు పూర్వవిద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఓటర్ల పరిశీలన

హిమాయత్‌నగర్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా పరిశీలనపై అన్ని పార్టీల నేతలు దృష్టి సారించారు. ఈమేరకు శుక్రవారం భారతీయ జనత పార్టీ నాయకురాలు భార్గవిరెడ్డి ఇతర కార్యకర్తలతో కలసి పలు బూత్‌లలో పర్యటించారు. బూత్‌నెంబర్-7లోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు లిస్టులో ఉన్న పేర్లుకు సంబంధించిన వ్యక్తులు ఆయా ఇళ్లల్లో ఉంటున్నారా లేదా అనేది గుర్తించారు. ఇలా డోర్ టూ డోర్ వెరిఫికేషన్ చేయడం వల్ల నకిలీ ఓట్లు ఏమైనా ఉంటే బయట పడతాయని భార్గవిరెడ్డి తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిని విడుదల చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: పెండింగ్‌లో ఉన్న రూ. 5400 కోట్ల విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిని వెంటనే విడుదల చేయాలని టీజేఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్‌కుమార్ శుక్రవారం డిమాండ్ చేశారు. కళాశాల్లో వివిధ కోర్సులు పూర్తి చేసిన పేద విద్యార్థులు ఫీజులు చెల్లించలేక సర్టిఫికెట్లు తీసుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు.

‘పక్షపాతంగా జీహెచ్‌ఎంసీ అధికారులు’


మాట్లాడుతున్న టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ సంగిశెట్టి జగదీశ్వరరావు

ముషీరాబాద్: జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ సర్కిల్ అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా పనిచేస్తున్నారని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రావు ఆరోపించారు. సదరు అధికారులపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టో పథకాల గురించి రూపొందించిన పోస్టర్లను ముషీరాబాద్ నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తే వాటిని గురువారం రాత్రి జీహెచ్‌ఎంసీ సిబ్బంది చేత బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేసి తొలగింపజేశారన్నారు. శుక్రవారం రాంనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే వాల్‌పోస్టర్లను రూపొందించామన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలు బ్యానర్లు అనేకం ఉన్నాయని వాటిపైన చర్యలు తీసుకోని జీహెచ్‌ఎంసీ అధికారులు కాంగ్రెస్ పార్టీ పోస్టర్‌లపైన చర్యలు తీసుకోవడాన్ని ఆయన ప్రశ్నించారు. గతంలో ‘కేసీఆర్ హఠావో తెలంగాణ బచావో’ పోస్టర్లను కూడా చించివేశారని దీనిపై చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసు రిజిస్టర్ అయిందన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని లేనిపక్షంలో తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ నేతలు ఎన్ని ఎత్తులు వేసిన కాంగ్రెస్ పార్టీ గెలుపును ఆపలేరని స్పష్టం చేశారు. టీపీసీసీ రాష్ట్ర నాయకులు జీ.ఎం.కేశవచారి, ఖరీం, రామకృష్ణ, అంజయ్యగౌడ్ తదితరులున్నారు.

కలుషిత నీటి సరఫరా సమస్యపై వినతి


వినతిపత్రం అందజేస్తున్న నవశక్తి యూత్ అసోసియేషన్ ప్రతినిధులు

నల్లకుంట: నల్లకుంట తిలక్‌నగర్ బస్తీలో గత కొద్ది రోజులుగా కలుషిత నీరు సరఫరా అవుతోందని బస్తీవాసులు జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నవశక్తి యూత్ అసోసియేషన్ ప్రతినిధి బృందం, బస్తీ వాసులతో కలిసి శుక్రవారం శివం జలమండలి మేనేజర్ రోహిత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బస్తీలోని ఇంటి నంబర్ 2-2-1107/5 నుంచి 2-2-1107/40 వరకు రోజూ కలుషితనీరు సరఫరా అవుతోందన్నారు. ఈ విషయమై పలుసార్లు జలమండలి సిబ్బందికి ఫిర్యాదు చేయగా.. తాత్కాలిక చర్యలు చేపడుతున్నామని, సమస్య శాశ్వత పరిష్కారానికి నూతన డ్రైనేజీ, వాటర్ పైపులైన్ వేయించాలని కోరారు. నవశక్తి యూత్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బత్తుల రవి, ప్రతినిధులు బాలరాజు, రాజగోపాల్, జనార్దన్ తదితరులున్నారు.

3న పద్మశాలీ శంఖారావం


కందగట్ల స్వామి

కాచిగూడ: పద్మశాలీ సమాజ సంక్షేమం, అభివృద్ధి, రాజ్యాధికార వాటా సాధనే లక్ష్యంగా ఈనెల 3న ఆదివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న పద్మశాలీ శంఖారావం సభను విజయవంతం చేయాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా పద్మశాలీలందరూ.. కుటుంబ సమేతంగా పాల్గొని ఐక్యతను చాటాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని ప్రధాన రాజకీయ పార్టీలను ఆయన డిమాండ్ చేశారు. పద్మశాలీలను విస్మరించిన పార్టీలకు ఓటు ద్వారా గుణపాఠం చెబుతామన్నారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, జాతీయ మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల, అవ్వారు భాస్కర్ తదితరులున్నారు.

హయత్‌నగర్ డిగ్రీ లెక్చరర్‌కు గిన్నిస్‌బుక్ చోటు


డాక్టర్ జహీదా బేగంను అభినందిస్తున్న ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లెక్చరర్ డాక్టర్ జహీదా బేగంకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు లభించింది. గత నెల 28 చెన్నైలోని హోటల్ తురియాలో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ రికార్డును అందుకున్న జహీదాబేగం శుక్రవారం వీసీ ప్రొ.రవిందర్ అభినందిచారు. ఓయూ కాలేజీల అధ్యాపకులకు ఇంత వరకు ఇలాంటి అరుదైన గుర్తింపు లభించలేదని తొలిసారి జహీదా బేగం సాధించిన ఈ రికార్డును యూజీసీ న్యాక్ గుర్తింపు కోసం పరిగణిస్తామని వీసీ పేర్కొన్నట్లు తెలిపారు. వరల్డ్-2023 గ్రంథంలో 200 ఆర్టికల్స్‌కు ఎడిటర్‌గా, మహిళ సాధికారత పై ‘షీ ఫర్ హర్ సెల్ఫ్’ పుస్తక రచయితగా, ఎడిటర్‌గా వ్యవహరించినందుకు గిన్నిస్ రికార్డులో చోటు లభించిన్నట్లు జహీదా బేగం వివరించారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

సుల్తాన్‌బజార్: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న అకౌంటెంట్స్ డీఈఓ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోఠి డీఎంహెచ్‌ఎస్ క్యాంపస్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె కొనసాగుతుందన్నారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, బాలసుబ్రహ్మణ్యం, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.


గోషామహల్ అభివృద్ధికి ప్రత్యేక కృషి

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో మంత్రి తలసానిని కలిసి ధూల్‌పేట్‌తో పాలు ప్రాంతాల్లో ఉన్న సమస్యలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలోనే కోట్ల రూపాయాల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ధూల్‌పేట్‌తో పాటు అన్ని ప్రాంతాల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

‘రాఘవేంద్రుని దర్శనం.. మోక్షానికి మార్గం’


కాచిగూడ, లింగంపల్లిలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి


ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



కాచిగూడ: లింగంపల్లిలోని రాఘవేంద్రస్వామి బృందావన సమితిలో స్వామివారి 352వ ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం మధ్యారాధన కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం నిర్మాల్య విసర్జనం అనంతరం స్వామివారి బృందావనానికి భక్తుల అష్టోత్తర పారాయణం, అభిషేకం, ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలకు మఠం అర్చకులు పాదపూజ, కనకాభిషేకం నిర్వహించారు. మధ్వ బ్రాహ్మణ సంప్రదాయం ప్రకారం గోపూజ, ధాన్యలక్ష్మి పూజను నిర్వహించిన అనంతరం స్వామివారికి మంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మేనేజర్ కె.నర్సింహ్మాచార్య వారికి శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. సమితి సభ్యులు ఎం.క్రిష్ణమూర్తి, బి.పి.రాఘవేంద్రరావు, బి.హరిరావు, కె.ఆర్.ప్రహ్లాదరరావు, ఎస్.రాజారావు, గురురాజ్‌రావు, హెచ్.రాఘవేంద్ర, బీ.కే.పవన్, కే.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

- బర్కత్‌పురలోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల జయజయ ధ్వానాల మధ్య మధ్యారాధన వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖద్వారం రంగురంగుల పూలతో అలంకరించిన తీరు భక్తులకు నయనానందకరం చేసింది. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, కాలేరు పద్మావెంకటేష్ తదితరులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మఠం మేనేజర్ కె.రాఘవేందర్ రావు, అర్చకులు, తదితరులున్నారు.

నేడు రథోత్సవం..

- ఉత్తర ఆరాధన సందర్భంగా నేడు బర్కత్‌పురలోని స్వామివారి మఠం వద్ద రథోత్సవం జరుగనుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మఠం మేనేజర్ కె.రాఘవేందర్‌రావు కోరారు.